
# సీలు కారియర్

టి. బి. జ్ఞానప్రసూన



మధ్యతరగతి సంసారంలో ప్రతి వస్తువు అవసరంగా, విలువ గలదిగా కనిపిస్తుంది. ప్రతిపైసకు రూపాయి బరువు ఉంటుంది. ఆ ఇల్లాలి ముచ్చట్లు, అచ్చట్లు ఇంటికే పరిమితం. ఆమె సుఖాలు, అనుభూతులు ఆ ఇంట్లోని ప్రతి వస్తువు చుట్టూ, ప్రతి ప్రాణి చుట్టూ పరిభ్రమిస్తుంటాయి.

ఇల్లు చిన్నదయినా విశాలమైన పెరడు. దానికితోడు బావి పక్కన పెద్ద బాదంచెట్టు ఎండవేళప్పుడు చక్కటి గొడుగుగా నిలుస్తుంది. ఆ నీడనే సుభద్రమ్మ కూర్చుని గోనెసంచి పైన నువ్వులు రుద్దుతూంది. చిన్నప్పుడు నేర్చుకున్న పాటలు ఇలాటి సమయంలోనే అనాలోచితంగా పెదవులమీదికి వస్తుంటాయి.



"సీతమ్మ పెళ్లంటె చూతమ్మ విరిసె
చెప్పకే పూచింది సిరిమల్లెతోట
మందార పూచినది, మంకెనా పూసె

పారిజాతము విచ్చె, సంపెంగ విచ్చె
ఆకులే తక్కువగ అన్ని తరువులు పూచె."

ఈ పాట పాడుకుంటూంది సుభద్ర. అక్కగారు నువ్వులు పంపింది. వాటిని పొట్టుతీసి, పప్పుచేసి పొడిచెయ్యాలి. పొడి అంటే పిల్లల కిష్టం. తనకూ ఇష్టమే! కాని ఆ విషయం తరవాత. అందుకనే వంట అవగానే ఒళ్ళు విరుచుకుని కూర్చోకుండా వచ్చి ఆ పని ప్రారంభించింది. ఇంతలో కూతురు సరళ పెరటి గుమ్మంలోకి వచ్చి "అమ్మా! అప్పన్న వచ్చాడే, కారియర్ దబ్బున తెమ్మన్నారుట" అంది.

సుభద్ర ఉలిక్కిపడి లేచింది. కాని మొరటుతేలిన చేతులకి నువ్వు పొట్టు అంటుకునిపోయింది. 'ఇదో అలస్యం' అనుకొంటూ పక్కనున్న బొక్కెనలో చేతులు కడుక్కొని చీరకి రాసుకుంటూ వంటింట్లోకి వచ్చింది.

కొక్కానికి తగిలించిన జర్మను సిల్వర్ కారియర్ తీసింది. దాని పై చెంచా పోయింది. అప్పన్న ఓ ఇనపకడ్డీ సంపాదించి దానికి పెట్టాడు. కారియర్ గిన్నెలన్నిటి మీద జల్లెడ చిల్లుల్లాగా సన్న సన్నగా నల్లటి మచ్చలు పడ్డాయి, ఒక్క అడుగు గిన్నెమీద తప్ప. అందులో అన్నం పెడుతుంది కనక అది బాగానే ఉంది, మిగతా గిన్నెలకి పులుసు, ఉప్పు తగిలి పాడయిపోయాయి. ఆ కారియర్ శుభ్రంగా తోమించడం కోసమని పనిమనిషిని చూసినప్పుడల్లా సుభద్ర రోజూ అరుస్తూనే ఉంటుంది. సుభద్ర కారియర్ గిన్నెలన్నీ మళ్ళీ ఒక సారి శుభ్రంగా తుడిచి అన్నం, కూరలు సర్దింది.

'దీనితో అన్నం పంపడానికి తనకే సిగ్గుగా ఉంటుంది. ఇంక ఆఫీసులో ఇది పెట్టుకు కూర్చుని తినటానికి ఆయ నెంత సిగ్గుపడతారో!' అనుకొంది సుభద్ర. చిన్న గిన్నెలో నెయ్యి వేసి అన్నం మధ్యగా నొక్కింది. కారియర్ అంతా బిగించి ఎక్కడయినా చారు చారలు, మజ్జిగ చారలు ఉన్నాయేమోనని పైన ఒకసారి తుడిచి అప్పన్న కిచ్చిపంపింది! "జాగ్రత్త, అప్పన్నా! త్వరగా వెళ్ళు" అంది.

మళ్ళీ పెరట్లోకి వెళ్ళి పప్పు బాగుచేయడం ప్రారంభించింది సుభద్ర. నువ్వులు గోనెపై వేసి రుద్దగానే పొట్టు వూడి తెల్లటి పప్పు పకపకలాడుతూ బయటపడుతూంది. పొట్టంతా చెరిగాక అది మరీ బాగుంటుంది. పప్పు ముట్టుకుంటే చేతిలోంచి జారి పోతూ నునుపుగా ఉంటుంది. సుభద్ర మనసు కారియర్‌ని గురించి ఆలోచిస్తూంది. ఈ కారియర్ కొని నాలుగయిదేళ్ళయింది. సుభద్ర పుట్టినింటికి, మెట్టినింటికి మధ్య దూరం ఎక్కువ. కొత్తలో తనూ, భర్త కలిసి ప్రయాణాలు చేసేటప్పుడు ఇంటి దగ్గిరనుంచి తల్లి ఫలహారాలు చేసి ఇచ్చి పంపేది. ఒకోసారి వాళ్ళకి కబుర్లలో తిండి సంగతి జ్ఞాపకమే ఉండేదికాదు. ఒకోసారి ఎక్కడో స్టేషనులో రైలుఆగినప్పుడు ఏమీతోచక తీసి ఫలహారం చేసేవాళ్ళు.

సంసారం కొంచెం పెరిగాక నిత్యావసరాలు, వాటితో పాటు ఎప్పుడో అక్కరకు వచ్చే వస్తువుల అవసరాలు పెరిగాయి. పుట్టింటికి వెళ్ళాలన్నా, అక్కణ్ణించి రావాలన్నా మధ్య దూరంలో పిల్లలు అన్నంకోసం గోల చేసేవారు. ఎక్కడపడితే అక్కడ కనిపించినవి కొని పిల్లలకి పెట్టడం సుభద్రకి అలవాటు లేదు. పైగా అంత పుష్కలంగా సుభద్ర భర్త ఖర్చుపెట్టేవాడు కాదు. అందుకోసం ఏ ఏడాదికో చేసే ప్రయాణం కోసం సుభద్ర కారియర్ కొంది. అవసరమయినప్పుడు వాడి, తరవాత తెల్లగా తోమి వంటింట్లో ఉన్న సిమెంటు అటకపై చివరగా పెట్టేది. ఒక వారం రోజులపాటు సాయంత్రం లైటు వేయగానే మిలమిల మెరిసేది కారియర్. క్రమంగా దానిపై దుమ్ము చేరుకొని క్రొమురంగుగా మారేది. ఎప్పుడయినా చేతిలో డబ్బులు అయిపోయి ఆలోచిస్తున్నప్పుడు 'ఈ వెధవ కారియర్‌కి అనవసరంగా పదిరూపాయలు పెట్టాను!' అనుకొనేది సుభద్ర.

అలా కారియర్ కొన్నాళ్ళు అటకపై తపస్సు చేసింది. ఇంతలో రామారావుకి ట్రాన్స్‌ఫర్ అయింది. కొత్తగా వచ్చిన ఊరిలో ఆఫీసుకి, ఇంటికి బోలెడు దూరం. మధ్యాహ్నం భోజనానికి రావడానికి టైము చాలదు. పైగా రామారావుకి సైకిలు లేదు. అందుచేత రోజూ అతనూ అందరితోపాటు మధ్యాహ్నం భోజనం ప్యూనుతో ఆఫీసుకే తెప్పించుకొంటున్నాడు. ఆరు నెలలు వాడేసరికి కారియర్ సహజగుణం బయట పెట్టి మచ్చలు పడటం ప్రారంభించింది.

సుభద్రకి స్టీలు కారియర్ కొనాలని చాలా రోజుల నించి కోరిక. కాని సంసారంలో పెగలడంలేదు. ఏదీ, క్రితం నెలలో యాత్రలకి వెళ్ళివస్తూ ఆడబడుచు పిల్లలూ, వాళ్ళ పినతల్లి దిగారా, చూస్తూండగానే నాలుగు రోజులకి ముప్ఫయి రూపాయలు అయిపోయాయి. వాళ్ళున్నంతసేపూ పళ్ళన్నీ బయటపెట్టి ఇకిలిస్తూ కబుర్లు చెప్పిన రామారావు వాళ్ళు వెళ్ళిన మరునాడు బియ్యం తేవాలనేసరికి ఆ పళ్ళే పటపట కొరికి 'పాడు సంసారం' అని తిట్టుకొన్నాడు. అంతకుముందు నెలలో పెద్దది కాస్త పెద్దమనిషయి కూర్చుంది. పెద్దబంతులూ, చిన్న బంతులూ చేయలేక పోయినా ముచ్చటగా కొత్త పరికిణీ, జాకెట్టూ, ఓణీ వేసి పారాణి పెట్టి చూసుకోవాలనే కోరిక అణచుకోలేకపోయింది సుభద్ర. తన ప్రాణానికదే పెద్ద ఖర్చు. ఇలాగే ఎప్పుడూ ఏదో ఒకటి. ఇత్తడి కారియర్ కొంచెం చవకగానే వస్తుంది కాని దానికి మళ్ళిమళ్ళి కళాయి పెట్టిస్తూ ఉండాలి. పైగా ఇప్పు డిత్తడి ఎవరు వాడుతున్నారు? ఎంత చిన్న ఉద్యోగస్థుడి పెళ్ళాం అయినా ప్రయాణం అనగానే స్టీలు మరచెంబు, స్టీలు కారియరు తీసుకు తయారవుతూంది.

'మరచెంబు మాట ఎలా ఉన్నా ముందు కారియర్ కొనాలి. షోకుకోసంకాదు, ఆయనకి రోజూ అవసరం. దర్జాగా ఆయన బల్లమీద స్టీలు కారియర్ విప్పుకుని భోజనం చేయాలి. స్టీలు కారియర్ కొంటే అందులో తను ఏ పదార్థాలు పెట్టినా పాడవవు. కాస్త సీకాయపొడి వేసి శుభ్రంగా తోముకోవచ్చు. ఎప్పటికప్పుడు కొత్తదానిలా ఉంటుంది.' ఇలా ఆలోచిస్తూంది సుభద్ర. పప్పుచేయడం అయింది. ఎండాక చెరిగితే ఆ పొట్టంతా పోతుంది. ఒకసారి చేటతో రాళ్ళు గాలించి డబ్బాలో పోస్తే కొన్నాళ్ళదాకా బెంగ లేదు.

అక్కయ్య జ్ఞాపకం వచ్చింది సుభద్రకి. అక్కయ్య సంసారం చిన్నదే అయినా అత్తవారి బలగం ఎక్కువ. పల్లెటూరి సంసారం. పప్పు, ఉప్పులకు లోటులేదు. ఎప్పుడయినా తను వెడితే ప్రాణం ఇస్తుంది. పిల్లలందరికి బట్టలు కుట్టిస్తుంది. తనకి చీర పెడు




'ఆటొమేషన్' ప్రవేశ పెట్టితే పలువురికి ఉద్యోగాలు పోతాయనే భయం ఉంది. దానిలో నిజం ఎంతైనా ఉంది.

ఒకానొక పారిశ్రామిక సంస్థ యజమాని ఉద్యోగులు అందరిని సమావేశపరిచి ఇలా ప్రకటించాడు:

"కొంతకాలంగా మన సంస్థలో ఒక వదంతి ప్రచారంలో ఉందని నాకు తెలుసు. అది నిజం. వచ్చేనెల మొదటి తేదిని మన సంస్థలో పూర్తిగా ఆటొమేషన్ ప్రవేశ పెట్టడం జరుగుతుంది."

సహజంగానే యజమాని ప్రకటన సమావేశంలో అలజడి కలగజేసింది. యజమాని కలగజేసుకుని మళ్ళీ ఇలా అన్నాడు: "మీలో ఏ ఒక్కరూ భయపడవలసిన అవసరంలేదు. ఒక్కరిని కూడా పనిలోనుంచి తొలగించడం జరగదు. అంతేకాదు, మీకు ఎప్పటివలెనే జీతాలు, బోనసులు సెలవు సౌకర్యాలు, అన్ని ఇతర సౌకర్యాలు లభిస్తాయి. అయితే మీరు వారానికి ఒక్క రోజు — బుధవారంనాడు పనికి హాజరు కావలసి ఉంటుంది. ప్రతి బుధవారమూ."

అందరూ కొంతసేపు నిశ్శబ్దంగా ఉండిపోయారు. తరవాత ఒక మూలనుంచి ఎవరో దీనంగా అడిగారు: "ఏమిటి? ప్రతి బుధవారమూనా?!"



తుంది. వచ్చేటప్పుడు అవి ఇవి డబ్బాల్లో పోసి పంపుతుంది. ఒకటి రెండు సార్లు "అవసరమైతే వాడుకోవే" అని కొంత రొక్కం చేతిలో పెట్టబోయింది. ఉత్త చేతులతో వెళ్లే సుభద్ర ఇవన్నీ తీసుకోడానికే సిగ్గుపడుతూంటే రొఖ్ఖం చూసి చుట్టలు చుట్టుకుపోయేది. తప్పించుకు పారిపోయి వచ్చేది. ఆ డబ్బు చూసినప్పుడు స్టీలు కారియర్ జ్ఞాపకం వచ్చేది కాని, పుచ్చుకొనేది కాదు సుభద్ర.

సుభద్ర ఇంట్లోకి వచ్చి అన్నం పెట్టుకొంది. సావిట్లో పిల్లలు గలగలా వాగుతున్నారు. పోస్ట్ వచ్చింది. సరళ కార్డు లోపల గిరాటువేసి మళ్లీ పరిగెత్తింది. సుభద్ర తల్లి ఉత్తరం వ్రాసింది. "మీ రందరూ కులాసా అని తలుస్తాను. ఆరోగ్యం జాగ్రత్త. పిల్లలకు ఆశీస్సులు. అల్లుడుగారిని అడిగినట్లు చెప్పు. ఇక్కడ ఒక సంబంధం ఉంది. మన సరళకి బాగుంటాడు. ఆరుగురు అప్పచెల్లెళ్ళు, నలుగురు అన్నదమ్ములు. మూడు వేలు కట్నం అంటున్నారు" అంటూ వ్రాసింది. సుభద్ర అన్నం తింటూనే ఉత్తరం చదివింది. మనస్సు వికలమయింది.

'ఏమిటో పిల్ల పెళ్లి చేయాలి! ఎలా చేస్తామో' అనుకొంది. ఆలోచిస్తూనే పరధ్యానంగా అన్నం తింది. ఎప్పుడో వచ్చింది సరళ. సుభద్ర కంచంచుట్టూ ఉన్న మెతుకులు ఏరి కంచంలో పడవేస్తూంది. సరళ వచ్చి కంచం అందుకొని కడగడానికి పెరటిలోకి వెళ్లింది. వెళుతూన్న కూతురివంకే చూస్తూ నిలబడింది సుభద్ర. కూతురి వదనంలో లావణ్యరేఖలు సన్నసన్నగా దోబూచులాడుతున్నాయి. అవి వయస్సుకి ఆనవాళ్ళు. సుభద్ర నిట్టూర్చి లోపలికి వెళ్లి కాసేపు నడుం వాల్చింది.

* * *

రామారావు ఆఫీసునుంచి ఆలస్యంగా వచ్చాడు. పిల్లలెవరూ నిద్రపోలేదు. రాగానే చుట్టూ మూగారు. రామారావు ముఖమయినా తుడుచుకోకుండా వాళ్లతో కబుర్లు చెప్పాడు. పెదవులు బిగించుకొని, నొసలు చిట్లించుకొని, గుండెలు పట్టుకొనేలా ఆఫీసులో పని చేసిన శ్రమంతా పోయినట్లనిపించింది. పువ్వుల్లా వికసించిన వాళ్ల మొహంలోంచి వచ్చే అనురాగపు పరిమళంతో రామారావు గుండెలు పేదదీరాయి. ఒళ్లో ఉన్న చిన్నాడి చేతిలో పదిపైసలు పెట్టాడు.

ఎదురుగుండా ఉన్న ఎడపిల్ల చేయిజాపింది, "నాన్నా. నాకో?" అని. రామారావు ఆ పిల్లకి, పెద్దపిల్లకి ఇచ్చాడు. సుభద్ర నవ్వి "మరి నాకో!" అంది.

"నీకూనా! ఇదుగో" అని రామారావు అయిదు రూపాయల నోటు తీసి ఇచ్చాడు. సుభద్ర మొహం నివర్ణమయింది.

"నవ్వులాట కడిగాను" అంది.

"నేను నిజంగానే ఇస్తున్నాను" అన్నాడు.

సుభద్ర వంకోచిస్తూ పుచ్చుకొంది. మళ్లీ అంది: "డబ్బు నాకెందుకు!"

"నీ కిష్టమయింది నువ్వు కొనుక్కో" అన్నాడు.


సుభద్రకి స్టీలు కారియర్ జ్ఞాపకం వచ్చింది. 'దీంతో ఏం వస్తుంది! ఇలాంటి అయిదులు ఇంకా కనీసం తొమ్మిది అయినా కావాలి.' అనుకొంది. 'పోనీ ఆ తొమ్మిదింటికి ఇది పునాది అయితే బాగుండును' అనుకొంది. నోటు జాగ్రత్తగా పెట్టెలో భరిణలో దాచింది.

* * *

ఎంత పని ఉన్నా బజారునించి కూరలు తేవడం రామారావుకి అలవాటు. పొద్దున్నే కూరలు తెచ్చి వంటింట్లో గుమ్మరిస్తూ "ఇదుగో ఆనపకాయ చెక్కా, ములక్కాడలు, కొత్తిమిర. మజ్జిగ పులుసుకి కావలసినవన్నీ తెచ్చానోయ్. కమ్మగా కాచు. ఇవాళ కాంటీన్ మొహం చూడను. మరి కాస్త అన్నం ఎక్కువగా వండిపెట్టి పంపించు. ఇదుగో, అందులో రెండు పెసరఉండలు కూడా వేశావో — ఇహ చెప్పాలా!" అన్నాడు హుషారుగా.

సుభద్ర స్మితంగా విని నవ్వుతూ "మజ్జిగ పులుసుకేం భాగ్యం, అలాగే చేస్తాలెండి" అంది.

ఆవేళ శ్రద్ధగా మజ్జిగ పులుసు వండింది. భర్తకి అన్నం వడ్డేటప్పుడు గిన్నెలో నొక్కినొక్కి మరి కాస్త అన్నం పెట్టింది. రెండో గిన్నెలో వంకాయ కూర, రవంత నిమ్మకాయ వేసింది. మూడోగిన్నెలో మజ్జిగ పులుసు, నాలుగో గిన్నెలో మజ్జిగ పోసింది. ఆదికాస్త కారడం మొదలెట్టింది. కాస్త గూటి



ఎ. వి. మోహన్ గుప్త (విజయవాడ-1)

మైనం గీకి గిన్నె అడుగున నొక్కి కారియర్ బిగించి పంపింది సుభద్ర.

సాయంత్రం భర్త రాగానే "పులుసు బాగుందా" అంది. "ఆఁ చాలా బాగుంది" అన్నాడు రామారావు ఆదోరకంగా. ఆ స్వరంలోనే తెలిసింది సుభద్రకి ఏదో జరిగిందని. కళ్లతోనే ప్రశ్నించింది. "గిన్నె చిల్లు పడితే ఆ వెధవ మజ్జిగనీళ్లు పొయ్యకపోతేనేం! అడుగున ఆ మట్టి పెట్టకపోతేనేం! అది కొంచ విరిగి సముద్రంలో పడ్డట్టు మజ్జిగ పులుసులో పడింది" అన్నాడు కోపంగా.

సుభద్ర కారియర్ తీసింది. అడుగుగిన్నెలో అన్నంలో పులుసు పోసి ఉంది. దానిపైన గూటి మైనం తేలుతూంది. అది పులుసు వేడికి కరిగి గిన్నెలో పడిపోయింది కాబోలు! ఆయన వదిలేశారు. ఏం మాట్లాడుతుంది సుభద్ర! 'పాడు కారియర్! పాపిష్టిదాన్ని' అని తిట్టుకొంది. భర్త మౌనంగా ఉన్నాడు. త్వరగా వంటచేసి అన్నం పెట్టింది. మౌనంగానే భోజనం కొనసాగించాడు. చివరికి సుభద్ర మధ్యాహ్నం మిగిలిన మజ్జిగ పులుసు గిన్నెలో వేసి మెల్లిగా కంచం దగ్గిర పెట్టింది. "వద్దులే" అని గిన్నెను దూరంగా జరిపాడు భర్త. "వేసుకోండి, మీకోసమే ఉంచాను" అని మళ్లీ కంచం దగ్గిర పెట్టింది సుభద్ర. ఆ గొంతులో ఏం ఆప్యాయత గోచరించిందో తలఎత్తి చూశాడు. ఆమె కళ్లలో ఏదో విజ్ఞప్తి కనిపించింది. పులుసు వడ్డించుకొన్నాడు. సుభద్ర తల అలవోరాలో దూర్చి తృప్తిగా నిట్టూర్చింది.

ఎలాగైనా స్టీలు కారియర్ కొనాలని ఆ రాత్రి నిశ్చయించుకొంది సుభద్ర. సంక్రాంతి పండగకి బట్టలకని డబ్బు ఇచ్చాడు భర్త. అందరికి కొని తన చీరకోసం మిగిలిన ఇరవై రూపాయలు దాచింది. పాతిక రూపాయలయ్యాయి. ఇంకా ఇంత సొమ్ము కావాలి. పండగ రేపనగా బట్టలు చూపిస్తూంటే "నీ చీరేదీ!" అన్నాడు రామారావు.

"నే కొనుక్కోలేదు."

"ఏం! మరేం కట్టుకొంటావ్! పండక్కి చీర లేకుండా ఎలా!"

"ఫరవాలేదు. మొన్న అక్కయ్య పెట్టిన చీర ఉందిగా — ఇంకా గడివిప్పలేదు. అది కట్టుకొంటాలెండి."

"డబ్బేంచేశావ్!"

"దాచాను."

"అబ్బో! ఈమధ్య రాణిగారికి డబ్బంటే ప్రేమ ఎక్కువయిందే! ఏం చేస్తావేం?"

"నా కిష్టమయింది కొనుక్కుంటా."

"ఊహూ" అని నవ్వాడు రామారావు.

ఆ నెల వారపత్రికలు కొనకుండా, కావాలనుకొన్నప్పుడల్లా పూలుబుక్కాయలు కొనకుండా, మధ్యాహ్నం కాఫీ మానేసి మరో అయిదు రూపాయలు ఆదాచేసింది సుభద్ర. ఇంకా ఇరవై రూపాయలు కావాలి. ఎలా?

* * *

అనుకోకుండా రామారావు అక్కకూతురు పెళ్లి అని ఉత్తరం వచ్చింది. వారం రోజులే ఉంది పెళ్లి. రామారావు బావగారు పోయి చాలా రోజులయింది. ఆయన భార్య జీవితం గడపటానికిగాను మిగిల్చిపోయింది ఒక్క మేడ. ఆ మేడలోనే ఒక మూల రెండు గదులలో తను ఉంటూ తక్కినదంతా అద్దెకిచ్చి, ఆ అద్దెలతో జాగ్రత్తగా గడుపుకొంటూంది రామారావు అక్క. ఈమధ్య చాలా రోజులుగా రామారావు తల్లికూడా మద్రాసులో కూతురి దగ్గిరే ఉంటూంది. పెళ్లికి తప్పక రమ్మని మరీ మరీ వ్రాసింది.

రామారావు ఎప్పుడూ మద్రాసు వెళ్లలేదు. మద్రాసులో పెళ్లి అనగానే పిల్లలందరూ సంతోషంతో గంతులువేస్తూ "మేం వస్తాం, మేం వస్తాం" అంటూ బయలుదేరారు. రామారావు అందరిని ప్రయాణం చేశాడు. పెళ్లికి ఆఫీసులో రెండు వందలు అప్పు తీసుకున్నాడు, పెళ్లికూతురి కానుకలకి, రానుపోను ఖర్చులకి సమానంగా సరిపోతాయని.

మరునాడే పెళ్లికి ప్రయాణం. 'మద్రాసులో స్టీలు చవక అంటారు. మంచిది కూడా దొరుకుతుందంటారు. స్టీలు కారియర్ అక్కడ కొనుక్కొంటే బాగుండును' అనుకొంది సుభద్ర. 'ఖర్చులకే బొటాబొటిగా ఉంటే ఇంకా ఇరవై రూపాయలు తనకేం ఇస్తారు? అడిగితే పైగా లక్ష దీవనలు వస్తాయి' అనుకొంది.

పోనీ, రమణమ్మగారిని అడిగితే? సాయంత్రం పని

అయాళ వాళ్లింటికేసి వెళ్లింది. రమణమ్మ కూర్చుని ఏదో పుస్తకం చదువుతూంది. సుభద్ర వెళ్లగానే లేచి నవ్వుతూ ఆహ్వానించింది. ఆ కబుర్లూ, ఈ కబుర్లూ అయాక తన అవసరం బయట పెట్టింది సుభద్ర. రమణమ్మ కొంచెం తటపటాయించింది.

"ఏదైనా వస్తువు పెట్టుకొందే ఇవ్వడం అలవాటు లేదండీ" అంది.

ఏం పెడుతుంది తను? మెళ్లో అరిగిన నల్ల పూసల గొలుసుంది. అది తీసి "పోనీ, ఇది ఉంచండి" అంది. రమణమ్మ సంతోషంతో దాన్ని తీసుకొని లోపలికి వెళ్లి వెంటనే డబ్బు తెచ్చింది.

* * *

రైలు ఎక్కేసరికి పిల్లలందరికి ఉత్సాహం పొంగింది. బీచ్, మ్యూజియం, జూ—వీటన్నిటిని గురించి ఒకళ్ల కొకళ్లు చెప్పుకొంటున్నారు. ఈమాటు ప్రయాణంలో సుభద్ర జర్మన్ సిల్వర్ కారియర్ తేలేదు. భోజనాలసమయానికి "పిల్లలకి కారియర్ తేలేదా" అన్నాడు రామారావు. "లేదు. అది అందరికి చాలదుగా! అందుకని ఇంత పులిహోర చేసి తెచ్చాను. ఆ నేతి సంచిలో ఉంది. పెరుగుకూడా తెచ్చాను" అంది. 'వచ్చేటప్పుడు కొత్త స్టీలు కారియర్ తెస్తాగదా, ఇది మళ్లీ ఎందుకు దిష్టిపిడతలా' అని పాత కారియర్ తేలేదు సుభద్ర. పెళ్లి జరుగుతున్నంతసేపూ 'ఎప్పుడీ తంతు పూర్తవుతుందా, ఎప్పుడు బజారు వెళదామా' అని ఆదుర్దా పడుతూంది సుభద్ర. పెళ్లి అవగానే మనుగుడుపులకి పిల్లతో వెళ్లమంది ఆడబడుచు. సుభద్ర భయంతో "ఆయనకి సెలవు లేదుగదా" అంది. ఆడబడుచు ఎందరినో పంపింది.

మరునాడు తెల్లవారేసరికల్లా పెళ్లిబడలిక అన్నా లెక్కచేయకుండా పిల్లల్నందరిని ముస్తాబు చేసింది సుభద్ర. ఎనిమిదిన్నరకి బద్ధకంగా లేచాడు రామారావు. లేచేసరికి అందరూ ముస్తాబయి ఉండటం చూసి 'కొత్తచోటు కదా! అందుకు కాబోలు' అనుకొన్నాడు. సుభద్ర బ్రష్, పేస్టు చేతి కందించింది. రామారావు అక్కతో, తల్లితో కబుర్లు చెబుతూ అరగంటసేపు మొహం కడిగాడు. స్నానం చేశాక అతనికి బట్ట లందించింది. రామారావు పిల్లల్ని వెంటవేసుకుని ఊరు చూపించటానికి బయలుదేరాడు.

తరవాత సుభద్ర బజారు బయలుదేరింది. కొత్త ఊరు కనక ఆ ఊరిలో ఉండే ఒక పిన్నిగారిని వెంట తీసుకు వెళ్లింది. చైనాబజారు వెళ్లారు. పెద్దపెద్ద స్టీలుకొట్లున్నాయి. ఒకదాంట్లోకి వెళ్లేసరికి వ్యాపారి సాదరంగా ఆహ్వానించి, "అమ్మగారికి ఏం కావాలో చూపించరా" అని అరిచాడు.

గుమాస్తా ముందుకు వచ్చి "రండి, మామ్మగారూ! ఇలా కూర్చోండి. ఏం కావాలండీ" అంటూ ఫాన్ వేశాడు.

"భోజనం కారియర్ కావాలి" అంది సుభద్ర.

క్రొత్తక్రొత్త రకాలు వేరు వేరు సైజులలో తెచ్చి చూపించాడు గుమాస్తా. అడుగున, పైన సన్నాలుండి, ప్రతి గిన్నెకి మూతయుండే కారియరూ, చేప్పిన్నలాటివి రెండు ఒకదానిపై ఒకటి బోర్లించివుట్టుండేవి, ఇంకా రకాలు చూపించాడు. సుభద్ర కనేపి నచ్చలేదు. చెంచా పెట్టేఉండే పాతమోడలుదే కావాలంది. ఇవన్ని పక్క కడ్డీలు వెడల్పయిపోతాయని, గిన్నెలపై మూతలలో ఏ ఒకటి పోయినా కారియరు వదులు అయిపోతుందని వంకలు పెట్టింది. పాతమోడలు కోసం రెండుమూడు కొట్లు తిరిగారు. కావలిసిన సైజులో దొరకలేదు. చివరికి ఒక కొట్టువాడు "పాండీ బజారు వెళ్లండమ్మా! దొరుకుతాయి" అన్నాడు. మళ్లీ సుభద్ర వాళ్లు ఈ చివరినించి ఆ చివరికి వెళ్లారు. దారిలో అక్కడక్కడా స్టీలు కొట్లు కనపడకపోలేదు. వాటిలో తను కోరుకునే కారియర్ ఉందేమోనని సుభద్ర ప్రాణం కొట్టుకొంది. అయినా బస్సు ఆగదుగా! 'సరే, పాండీబజారులోనే చూద్దాం' అను కొంది. వెంటవచ్చిన పిన్నిగారు దారిలో కనబడే భవనాలను గురించి చెబుతూంది. సుభద్ర కేమీ వినిపించడం లేదు.

"మా ఊళ్లో మంచి కారియర్లు ఉండవు, పిన్నిగారూ! పోనీ, ఇక్కడ బాగుంటాయి కదా కొందామని. మళ్లీ ఈ డబ్బు ఖర్చయితే కుదరదు" అంది.

"అవునే, అమ్మాయ్, ఇప్పుడు స్టీలు కొంటంఅంటే భయంగా ఉంది. బోలెడు కంపెనీలు తయారు చేస్తున్నాయి. పాత కంపెనీల సరుకు రావడం లేదమ్మా. మావాడి అన్నప్రాశనకి గిన్నె కొన్నాగా! రాయిలా ఇప్పటికి అలాగే ఉంది. చక్కగా తోమి బోర్లిస్తే వెండిగిన్నే అనుకో! చెబితేగాని స్టీలు అని తెలియదే" అంది.

పాండీబజారు వచ్చింది. పిన్నిగారు, సుభద్ర పాండీ బజారులో స్టీలు కొట్లోకి వెళ్లారు. యథాప్రకారంగానే మళ్లీ అక్కడా రకరకాల కారియర్లు చూపించారు. సుభద్ర తనకి కావలిసిన కారియర్‌ని గురించి వర్ణించింది. అతను తెచ్చాడు. ఒకటి చూసింది. గిన్నెలు పల్చగా రేకుల్లా ఉన్నాయి. లోపల నేతి గిన్నె లేదు. ఆ కారియర్ ఖరీదు యాభై రూపాయలు. మరొక కారియర్ గిన్నెలు దళసరిగా పొందికగా ఉన్నాయి. లోపల నేతి గిన్నె ఉంది. కాని దాని ఖరీదు మరో పది రూపాయ లెక్కువ. సుభద్ర రెంటినీ మార్చిమార్చి చూసింది.


"దళసరిదే కొనుక్కో, అమ్మాయ్.. ఇలాటి వస్తువులు కొనుక్కొన్నప్పుడు మంచిదే తీసుకోవాలి. మళ్లీ మళ్లీ కొంటామా! మరో పది ఎక్కువ అయినా నష్టం కాదు" అంది పిన్నిగారు.

"నాదగ్గిర యాభయ్యే ఉన్నాయి" అంది సుభద్ర మెల్లిగా.

"ఆ పది నే నిస్తాలే. తరవాత ఇద్దువుగాని" అంటూ కొంగుమంచి తీసి ఇచ్చింది.

## "లకోటా" ప్రశ్నలు

— లాంగ్టన్



సుభద్ర వందసార్లు గిన్నెల్ని అటూ ఇటూ తిప్పి సొట్టలులేకుండా చూసి రెండుసార్లు బిగించి మళ్ళీ ఊడదీసి చివరికి అరవై రూపాయలు యిచ్చి పుచ్చుకొంది.


అక్కడే ఒక అబ్బాయి గిన్నెలపై పేర్లు వేస్తున్నాడు. వాడిచేతి కిచ్చి గిన్నెలపై వరస నెంబర్లు వేయించింది. "పేరు ఏం వెయ్యమంటారమ్మా" అన్నా డతను.

"నీపేరే వేయించుకోవే!" అంది పిన్నిగారు.

"నాపే రెందుకు లెండి ఆఫీసుకి తీసుకెళ్ళేదానిపై" అని, "ఇంగ్లీషులో పొడి అక్షరాలతో వెయ్యవోయ్, ఎస్. ఆర్. రావు అని" అంది.

గిన్నెలపైనా మూతపైనా, కడ్డీపైనా, చివరికి చెంచాపైనా పేరు వేయించింది జాగ్రత్తగా.

ఇంటికి వెళ్ళేసరికి పిల్లలు ఆయన, రాలేదు.




'హమ్మయ్య' అనుకుంది. దాన్ని పెట్టెలో అడుగున పెట్టి పైన బట్టలు సర్దింది.

పెళ్ళినించి ఇంటికి రాగానే కారియర్ శుభ్రంగా తోమింది. తుడిచి పెట్టింది సుభద్ర. ఇంకా ఆవేళ సెలవుంది. రామారావు ఆఫీసుకు వెళ్ళలేదు. రేపు కొత్త కారియర్‌లో భోజనం పంపడం. చుట్టుపక్కల వాళ్ళ కందరికి చూపించి మురిసిపోయింది సుభద్ర.

ఆ మరునాడు మధ్యాహ్నం ఆఫీసుకి కొత్త స్టీలు కారియర్‌లో అన్నం పంపింది. ఒక పండగకి చీర కొనుక్కోపోతేనేం! ఒక నెల కాఫీ తాగకపోతేనేం! ఒక నెల పుస్తకాలు చదవకపోతేనేం! మొత్తానికి అనుకొన్నట్లు స్టీలు కారియర్‌లో దర్జాగా భోజనం పంపగలిగింది సుభద్ర. రమణమ్మకి, పిన్నిగారికి డబ్బు నెమ్మదిగా తీర్చవచ్చు. కారియర్ పంపాక తృప్తిగా నిద్రపోయింది సుభద్ర. కళ్ళు మూసుకోగానే మద్రాసులో తను స్టీలు కారియర్ కొన్న కొట్టు కళ్ళముందు కనిపించింది. బిందెలు, మంచినీటి డ్రమ్ములు, పళ్ళాలు, ఒకటేమిటి, బోలెడు సామానులు! నిద్రలేచాక అనుకొంది—బతికి బాగుంటే ఈసారి స్టీలు మరచెంబు కొనాలి. 'దాంట్లో మంచినీళ్ళు పోసి ఆయనకి పంపాలి' అని.

* * *

సాయంత్రం రామారావు హడావిడిగా ఇంటికి వచ్చాడు. సుభద్ర చాటంత మొహంతో ఎదురు వెళ్ళి కారియర్ అందుకొంది. కారియర్ గురించి భర్త ఏవో చెబుతాడనుకొంది. పాత కారియర్‌కంటె ఇది నీటుగా, దర్జాగా ఉందని, తన తోటి ఉద్యోగులు అంతా "కొత్తదా?" అని అడిగారని, "అవును, మా ఆవిడ పొదుపుచేసి కొన్నది" అని తను చెప్పానని అంటాడని అనుకొంది. కాని అలాటిదేదీ జరగలేదు. సుభద్ర వీపు మీద చేయివేసి,—

"కలకత్తానుంచి మా ఆఫీసరు వస్తున్నాడు. వస్తు స్టేషనుకి వచ్చి కలుసుకోమన్నాడు. ఎనిమిది గంటల కల్లా వెళ్ళాలి. త్వరగా వంటచేయి. తెలుగు భోజనం అంటే పడి చచ్చిపోతాడు. అన్నట్టు కొత్త కారియర్ ఎప్పుడు కొన్నావోయ్! బాగుంది! బలే, సమయానికి తెచ్చావ్!" అన్నాడు.

"మరచెంబు ముప్పయి రూపాయలుట" అంది.

"కొనేయకపోయావ్!"

"భలేవారండీ! ఇది కొనడానికి ఎంత అవస్థపడ్డా ననుకొన్నారూ" అని దీర్ఘం తీసింది.

ఆ దీర్ఘాన్ని కత్తిరిస్తూ రామారావు "త్వరగా కానీ మరి . . ." అని రెండు మూడు వంటకాలు పురమాయించాడు. సుభద్ర త్వరగా చేసి పాతకారియర్‌లో సర్దబోయింది. క్రొత్త కారియర్‌లో భర్తకి తప్ప ఎవరికీ భోజనం పంపటం ఇష్టంలేకపోయింది సుభద్రకి. ఇంతలో రామారావు "అదేమిటోయ్ పాడు? క్రొత్తది ఉందిగా, దాంట్లో పెట్టు" అన్నాడు. సుభద్ర భర్తవంక ఒకసారి చూసి అయిష్టంగానే క్రొత్తదాంట్లో సర్దింది.

రామారావు స్నానంచేసి ఇస్త్రీ మడతలు కట్టుకొని, ఆకు చెప్పులు వేసుకొని విలాసంగా స్టేషనుకి బయలుదేరాడు. ఆఫీసరు రామారావుని చూసి సంతోషించాడు. కష్టం, సుఖం కనుక్కొన్నాడు. రామారావుకి పారవశ్యం కలిగింది. ఇలాటి ఆఫీసరు దొరకడం నిజంగా తన అదృష్టం! రామారావు తనే అరటి ఆకు బెర్తుపై పరిచి అన్నంవడ్డించాడు. కొసరి కొసరి మారుపెట్టాడు.

"భోజనం చాలా బావుందోయ్. ఈ మాటు వస్తే మీ యింటికే వస్తా" అన్నాడు ఆఫీసరు.

"అంతకంటేనా!" అన్నాడు రామారావు.

భోజనం అవగానే నౌకరు గిన్నెలు కడిగి కారియర్ బెర్తు దగ్గరగా పెట్టాడు. మధ్య మధ్య కారియర్‌వంక చూస్తూ రామారావు తన ఇంక్రిమెంటును గురించి, లోన్ గురించి ముఖ్యమైన విషయాలు మాట్లాడాడు. టైము కావచ్చింది.

"పాడు ప్రయాణం. విసుగెత్తుతూందోయ్. ఏవైనా నాలుగు మంచి మాగజైనులు తెచ్చిపెట్టు" అని డబ్బులు అందివ్వబోయాడు ఆఫీసరు.

"ఫరవాలేదండీ!" అని కారియర్ పుచ్చుకుని పరుగెత్తాడు రామారావు. కారియర్ పక్కనపెట్టి హిగ్గిన్ బాదమ్స్‌లో పుస్తకాలకోసం వెతుకుతున్నాడు. ఇంతలో రైలు కూసింది. రామారావు పుస్తకాలు అందించలేకపోతానేమో అని ఖంగారుగా పరుగెత్తాడు. పుస్తకాలు ఎలాగో అలా ఆయన చేతికిచ్చాడు. రైలు కదులుతూంది. రామారావు నెమ్మదిగా తానూ రైలుతోపాటు నడుస్తూ మాట్లాడుతున్నాడు. ఆఫీసరు రామారావుని ఫామిలీతో ఒక సారి తన ఊరు రమ్మని అడిగాడు. "అలాగే సార్" అన్నాడు రామారావు. రైలు వేగం హెచ్చింది. ఆఫీసరు బెర్తుమీదఉన్న పూలదండ రామారావు చేతిలో పెట్టి "పిల్లల కియ్యి" అన్నాడు. రామారావు నవ్వుతూ పట్టుకుని తన్మయత్వంతో ఆఫీసరు వంక చూస్తున్నాడు. రైలు దాటింది. రామారావు ఒక్కసారి బాహ్య ప్రపంచంలోకి వచ్చాడు. చేతి వంక చూసుకొన్నాడు. కారియరేది? చేతిపై పూలదండ తాచుపాములా అనిపించింది. గభాలున విదిలించివేశాడు. అది ప్లాటుఫారం పైన దూరంగా పడింది.

రామారావు హిగ్గిన్‌బాదమ్స్ వేపు పరుగెత్తాడు. అక్కడ కారియర్ లేదు. అక్కడున్న గుమాస్తాను "ఇక్కడ కారియర్ పెట్టా. ఏదీ? ఇప్పుడే పెట్టివెళ్ళా" అన్నాడు.

"కారియరా! ఎక్కడ పెట్టారండీ!" అన్నా డతను.

"ఇక్కడే పెట్టానోయ్. కొత్తది. స్టీలుకారియర్" అన్నాడు రామారావు.

"అదా అండీ! ఇప్పుడే ఎవరో ఒకాయన పుచ్చుకొని చివరి పెట్టెలో ఎక్కాడండీ!" అన్నా డతను.

రామారావు రైలువంక చూశాడు. స్టేషను దాటి వెళ్ళిపోయి సిగ్నలు దగ్గిర గావుకేక పెట్టింది. రామారావు పిచ్చివాడుగా నిలబడిపోయాడు. సుభద్ర రెండు కళ్ళూ కనిపించాయి. పాత జర్మన్ సిల్వర్ కారియర్ ఆ కళ్ళలో ఊగిసలాడింది. రామారావుకి మొదటిసారిగా ఇంటికి వెళ్ళాలంటే భయంవేసింది! ★